సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం । 26 । మార్చి । 2024




క్షీరారామంలో చండీ హోమం

పాలకొల్లు సెంట్రల్ : పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో చండీ హోమం జరిపించారు. ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు, ఈఓ సూర్యనారాయణ పర్యవేక్షించారు.



కొల్లేరులో చెరువు గట్లు ధ్వంసం

ఆగడాలలంక రెవెన్యూ పరిధిలో అక్రమంగా నిర్మించిన కొల్లేరు కాంటూరు చెరువు గట్లను అధికారుల సమక్షంలో నిర్వాహకులే స్వచ్ఛందంగా ధ్వంసం చేశారు. 8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం (సాయంత్రం)	సహరి బుధవారం (ఉదయం)
భీమవరం	6.22	4.44
ఏలూరు	6.25	4.42

న్యూస్‌రీల్

ఎన్నికల నిబంధనలు పాటించాలి

కలెక్టర్ సుమిత్ కుమార్



భీమవరం (ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సాధారణ ప్రవర్తనపై రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. విభేదాలను పెంచేలా, పరస్పర ద్వేషాలను కలుగజేసేలా, విభిన్న కులాలు, వర్గాలు, మతాలు లేదా భాషల మధ్య ఉద్రిక్తతకు దారితీసేలా ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించరాదన్నారు. మతం, వర్గం, కులం భావాలతో ఓట్లు అభ్యర్థించరాదన్నారు. ఆలయాలు, మసీదులు, చర్చి వంటి ఆరాధన ప్రదేశాలను ఎన్నికల ప్రచారానికి వేదికగా ఉపయోగించరాదన్నారు. అభ్యర్థుల వ్యక్తిగత జీవితానికి సంబంధించి అతని ప్రజా జీవితంతో సంబంధం లేని అంశంపై విమర్శలు చేయరాదన్నారు. ఏదైనా రాజకీయ పార్టీని విమర్శించినప్పుడు పార్టీ విధానాలు, కార్యక్రమాలు, గత రికార్డులు, పనులకే పరిమితం కావాలన్నారు. జెండా కొయ్యలను అమర్చడానికి, నోటీసులు, పోస్టర్లు, నినాదాలు తదితర వాటిని అంటించడానికి ముందుగా అనుమతులు పొందాలన్నారు. ఓటర్లకు ఏ రూపంలోనైనా లంచం లేదా రివార్డును ఇవ్వకూడదని, పోలింగు కేంద్రానికి వంద మీటర్లలోపు ఓట్ల కోసం ప్రచారం చేయడం, అర్థించడం చేయకూడదన్నారు. పోలింగ్ కేంద్రానికి ఓటర్లను వాహనాల్లో తరలించరాదన్నారు. పోలింగ్ అధికారుల విధులను అడ్డగించరాదన్నారు. ఓటరుకు బదులుగా వ్యవహరించడం, లేదా ఓట రుమారు పేరు కింద ఓటు వేయడానికి ప్రయత్నించడం చేయరాదన్నారు. రాజకీయ పార్టీల సభ్యులు, నాయకులను అనుకరించే దిష్టిబొమ్మల ర్యాలీలు, దహనాల వంటి ప్రదర్శనలను ఎవ్వరూ ప్రోత్సహించరాదని కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి మల్లికార్జునరావుకు జ్ఞాపిక అందిస్తున్న డీఈఓ బాబురావు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు సోమవారం సందర్శించారు. కుటుంబసమేతంగా విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు న్యాయమూర్తికి శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ డీఈఓ బాబురావు స్వామివారి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఏఈఓ పి.నటరాజారావు ఉన్నారు.

మామిడి ఫలసాయానికి 28న వేలం

నూజివీడు: నూజివీడు మామిడి పరిశోధన స్థానం ఆవరణలోని 485 మామిడి చెట్ల ఫలసాయానికి ఈనెల 28న ఉదయం 10.30 గంటలకు కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మి సోమవారం తెలిపారు. ఆసక్తి గల వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలని, వేలం అనంతరం మిగిలిన వారి డిపాజిట్లు నగదు వాపసు చేస్తామన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు తోటను తనిఖీ చేసుకోవచ్చని సూచించారు. పాటదారుడు పాట మొత్తంలో సగం సొమ్మును వేలం పూర్తయిన వెంటనే చెల్లించాలని, ప్రతి చెట్టు ఫలసాయాన్ని విడిగా లెక్క చెప్పాల్సి ఉంటుందన్నారు. సబ్‌లీజుకు ఇవ్వడానికి వీల్లేదని, ప్రతి చెట్టుకు ఐదు కాయలను పాటదారుడు పరిశోధనల నిమిత్తం ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

దేశీయ వరి.. సాగు సిరి

- విస్తరిస్తున్న దేశీయ వంగడాల సాగు
- సేంద్రియ పద్ధతులపై రైతుల ఆసక్తి
- ఆరోగ్యానికి మేలు.. ఆదాయం వృద్ధి
- జిల్లాలో 14,200 ఎకరాల్లో పంటలు

ఆకివీడు : జిల్లాలో దేశవాళీ వంగడాల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ పెట్టుబడులు, అధిక లాభాలు ఉండటంతో ఇటుగా మరలుతున్నారు. ఇటీవల దేశవాళీ వంగడాల బియ్యానికి డిమాండ్ పెరగడంతో వీటి సాగు విస్తీర్ణం పెరిగింది. దేశీయ వంగడాల బియ్యంలో ఔషధ గుణాలు ఉండటంతో పాటు ఆరోగ్యానికి మేలు చేయడంతో వీటికి రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోంది. జిల్లాలోని పలు గ్రామాల్లో దేశీయ వంగడాల్ని రైతులు సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం, జీవామృతం, సేంద్రియ ఎరువులతో పంటలు పండిస్తున్నారు. సార్వా, దాళ్వా సీజన్‌లలో పలు రకాల దేశీయ వంగడాలు సాగుచేస్తున్నారు. 130 నుంచి 160 రోజుల వ్యవధిలో ఆయా రకాల పంటలు మాసూళ్లకు వస్తాయి.

ధర అదుర్స్

దేశవాళీ వంగడాల బియ్యానికి మార్కెట్ ధర లాభసాటిగా ఉంది. రైతువారీ మార్కెట్‌లో ఆయా వంగడాలను బట్టి కిలో బియ్యం రూ.100 నుంచి రూ.200 వరకు పలుకుతోందని రైతులు చెబుతున్నారు. దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో ప్రకృతి వ్యవసాయం వైపు రైతుల వెళుతున్నారు. ప్రకృతి వ్యవసాయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని ప్రోత్సాహకాలు అందజేస్తే మరింత మంది వచ్చి ఆరోగ్యకరమైన పంటలను ప్రజలకు అందించే అవకాశం ఉంటుందని పలువురు రైతులు అంటున్నారు.



కొమరవరంలో దేశవాళీ వంగడాల సాగు

బహుళ ప్రయోజనాలు

దేశీయ వంగడాల బియ్యం ద్వారా ఆరోగ్య సమాజం ఏర్పడుతుందని రైతులు అంటున్నారు. వీటిలో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని, ఏఏ రకాల వంగడాల బియ్యం తినడం ద్వారా ఏఏ జబ్బులకు దూరంగా ఉండవచ్చనే విషయాలను రైతులే చెబుతున్నారు. కొన్ని రకాలు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని అంటున్నారు.



ఆకివీడులో బహురూపి వంగడం సాగు

జిల్లాలో దేశీయ వంగడాల సాగు

- » సార్వా సీజన్‌లో.. రక్తచాలీ, రెడ్ బాస్మతి, రెడ్, బ్లాక్ రైస్, రాజమౌళి, విజయ్‌పట్నాలీ, కులికటాలియా, ఇంద్రసేన, జీరా సాంబా, బహురూపి, చిట్టి ముత్యాలు రకాల సాగు.
- » దాళ్వా సీజన్‌లో.. పుంగార్, నవార్, చింతలూరు సన్నాలు, కులకర్ణి, కులాకర్, రక్తచాలీ, కాలాబట్టి, చిట్టి ముత్యాలు రకాల సాగు.

జిల్లాలో ప్రకృతి వ్యవసాయం

ఎకరాల విస్తీర్ణం	12,451
సాగు చేసే రైతులు	14,200
నవధాన్యాల సాగు రైతులు	12,000
దేశవాళీ వంగడాల సాగు	900 ఎకరాలు
సాగు చేసే రైతులు	1,360

టీటీడీకి ఆర్గానిక్ బియ్యం



సేంద్రియ పద్ధతిలో దేశవాళీ వంగడాల్ని సాగు చేస్తున్నాను. బహురూపి, చిట్టి ముత్యాలు, చింతలూరు సన్నాలు వంటి రకాలు పండిస్తున్నాను. ఎకరాకూ 25 నుంచి 30 బస్తాల దిగుబడి వస్తుంది. ధర ఆశాజనకంగా ఉంది. నేను పండిస్తున్న ఆర్గానిక్ దేశవాళీ బియ్యం తిరుమల తిరుపతి దేవస్థానానికి కిలో రూ.70 చొప్పున ఏటా రెండు టన్నుల చొప్పున దాతలు కొనుగోలు చేసి పంపిస్తున్నారు. ఈ బియ్యాన్ని స్వామి వారి నైవేద్యానికి వినియోగిస్తారు.

– వాదపల్లి జగన్, ఆర్గానిక్ రైతు, ఆకివీడు

రసాయన రహిత పంటలు



ప్రకృతి సేద్యంతో రసాయన పదార్థాలు లేని పంటలు ఉత్పత్తి అవుతున్నాయి. ఎరువులు, పురుగు మందుల వాడకం నిషేధించి, సేంద్రియ, జీవామృత ఎరువుల వాడకంతో మంచి సూక్ష్మపోషక విలువలున్న పంటలు పండించవచ్చు. పశ్చిమగోదావరి జిల్లాలో నవధాన్యాలను 12 వేల మందికి పైగా రైతులు సాగు చేస్తున్నారు. దేశీయ వంగడాలకు మంచి డిమాండ్ ఉంది. రైతులకు మద్దతు ధర కన్నా లాభసాటి ధర లభిస్తుంది.

– పితాని వెంకటేశ్వరరావు, పోడూరు

లాభసాటి ధర



ప్రకృతి వ్యవసాయ, దేశీయ వంగడాల పంటలకు లాభసాటి ధరలు లభిస్తున్నాయి. పెట్టుబడులు సాధారణంగా ఉన్నా దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎరువులకు బదులు జీవామృతం, బయోకల్చర్, సేంద్రియ ఎరువులు వాడుతున్నాం. రసాయన రహిత బియ్యం ఉత్పత్తి అవుతున్నాయి. కొన్నేళ్లుగా ప్రకృతి సాగు విధానంలో పంటలు పండిస్తున్నాను. ప్రస్తుత రబీలో నాలుగు ఎకరాల్లో నాలుగు రకాల దేశీయ వంగడాల్ని సాగు చేస్తున్నాను.

– గంటా రామకృష్ణ, ఆర్గానిక్ రైతు, కొమరవరం, తణుకు మండలం

భవిష్యత్‌లో మరింత అభివృద్ధి



కృష్ణాయపాలెం గ్రామంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: రానున్న ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం మండలంలోని జగన్నాథపురం, కృష్ణాయపాలెం, ఆరుగొలను గ్రామాల్లో సోమవారం ఆయన ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. తన హయాంలో జగన్నాథపురం, కృష్ణాయపాలెం, ఆరుగొలను గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో పలు సమస్యల పరిష్కారానికి కృషి చేశానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించామని, పార్టీలకతీతంగా లబ్ధి చేకూర్చామన్నారు. జగన్నాథపురంలో రైతులకు సుమారు రూ.2 కోట్ల పంట నష్టపరిహారం అందించామని, లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సుమారు 700 ఎకరాలను సాగులోకి తీసుకువచ్చామన్నారు. సంక్షేమం, అభివృద్ధి కోరుకునే ప్రతి ఒక్కరూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి జగన్‌ను సీఎంగా, ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌మార్, సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, ఎంపీపీ పానుకుమాటి శేషులత, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే ఉపేక్షించం

నూజివీడు : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ వై.భవాని శంకరి హెచ్చరించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీఎస్పీ జి.లక్ష్మయ్యతో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అభ్యర్థులు సభలు, సమావేశాలు, ప్రచారాలు నిర్వహించేటప్పుడు 48 గంటల ముందు అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కోడ్‌ను ఎవరూ అతిక్రమించినా ఆర్డీఓ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చెయ్యాలన్నారు. కోడ్ ఉల్లంగించిన అభ్యర్థులకు ముందుగా నోటీసులు ఇస్తామని, తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. పెద్దస్థాయిలో నిర్వహించే వేడుకలకు సైతం అనుమతి తీసుకోవాలన్నారు. కోడ్ పరిరక్షణకు ఆరు బృందాలతో గస్తీ తిరిగేలా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. న్యూస్ చానల్స్, ప్రింట్ మీడియాలో ప్రచురితమయ్యే పెయిడ్ ఆర్టికల్స్ పైనా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా వ్యక్తిగత వాహనాలపై స్టిక్కర్లు అంటించినా, ఇళ్లపై జెండాలు కట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటింటా సంక్షేమ కాంతులు



పండితవిల్లూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు, ఎంపీ అభ్యర్థి ఉమాబాల

పోడూరు: వైఎస్సార్‌సీపీ పాలనలో ఇంటింటా సంక్షేమ కాంతులు వెల్లివిరిశాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలతో కలిసి ఆయన పండితవిల్లూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా సీఎం జగన్ ఇంటింటా సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఆచంట నియోజకవర్గంలో అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. గడప చెంతకే పారదర్శకంగా పథకాలు అందించామని అన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి ఉమాబాల మాట్లాడుతూ సీఎం జగనన్నతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని, పేదలు, సామాన్యులకు సంక్షేమం అందుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, మండల కన్వీనర్ పిల్లి నాగన్న, ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, వైస్‌చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, సర్పంచ్ ఇళ్ల లక్ష్మీచంద్రిక, సొసైటీ చైర్మన్ గెద్దాడ ఏకలవ్య, ఎంపీటీసీ ఇందుకూరి సూర్యకాంతం, ఉప సర్పంచ్ సదమళ్ల వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు జక్కంశెట్టి రఘు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్పొరేషన్ డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



పీఎం లంకలో ఎన్నికల ప్రచారం చేస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని, ఆయన్ను మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం పెదమైనవానిలంక (పీఎం లంక)లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ప్రతి ఓటరూ ఫ్యాన్ గుర్తుపై ఎంపీ, ఎమ్మెల్యేలకు రెండు ఓట్లు వేయాలని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు మరోమారు అవకాశం ఇవ్వాలని కోరారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఓ పక్క సంక్షేమంతో పాటు మరోపక్క అభివృద్ధి జరిగిందన్నారు. సీఎం జగన్ 98 శాతం హామీలను అమలు చేశారన్నారు. పేదరికమే అర్హతగా పథకాలను అమలు చేశారన్నారు. తొలి రెండేళ్లలో కరోనాతో ఇబ్బందులు ఎదురైనా ఎక్కడా పథకాలను విస్మరించలేదని గుర్తుచేశారు. అవినీతికి తావులేని పాలన అందించిన జగన్‌కు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. యువనేత ముదునూరి శ్రీకృష్ణంరాజు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, జెడ్పీటీసీలు బొక్కా రాధాకృష్ణ, బాపూజీ, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, బందన పూర్ణచంద్రరావు, అంద్రాజు చల్లారావు, తిరుమాని వెంకటేశులు, దొంగ మురళీకృష్ణ, కొల్లాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం



ఉండిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: సీఎం జగన్ సంక్షేమ పాలనకు ముందొక లెక్క.. సంక్షేమ పాలన చూసిన రాష్ట్ర ప్రజలది ఇప్పుడు మరో లెక్క.. వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని ఉండి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. సోమవారం ఉండి చిక్కాల వీరన్ననగర్ తదితర ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. గతంలో ఏ పథకం కావాలన్నా నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేందని, సీఎం జగన్ పాలనలో అర్హులందరికీ పథకాలు అందిస్తున్నారు. దీంతో ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు సంక్షేమ పథకాలు అందాయంటూ ఆనందంగా చెబుతున్నారన్నారు. సీఎం జగన్‌కు మరోమారు పట్టం కడతామంటూ ప్రజలంతా చెబుతున్నారన్నారు. ఉండి స్థానం టీడీపీకి కంచుకోట అంటున్నారని, గతంలో వైఎస్సార్ హయాంలో ఓసారి బద్దలు కొట్టారని, మరలా ఇప్పుడు సీఎం జగన్ పాలన చూసిన ప్రజలు పగలకొట్టనున్నారన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. చంద్రబాబు ఆడినట్టు ఆడే జీవిగా పవన్‌కళ్యాణ్ ఉన్నారని దుయ్యబట్టారు. తమకు మేలు చేసిన సీఎం జగన్‌కు కాపులంతా ఓట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కూటమి అభ్యర్థులకు ఘోర పరాభవం తప్పదన్నారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గమహంకాళి, సర్పంచ్ కమతం సౌజన్యబెనర్జీ, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, యేడిద వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ వీరమల్లు సత్యవతి, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి



దొడ్డిపట్లలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి

యలమంచిలి: పేదల సంక్షేమమే పరమావధిగా పాలన సాగించిన సంక్షేమ పథకాల రథసారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా తమ ఓట్లతో ఆశీర్వదించాలని పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. దొడ్డిపట్లలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లుగా నవరత్నాల పథకాలతో లబ్ధి పొందిన వారంతా తమకు కలిగిన మేలు వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్న రుణం తీర్చుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటిని కూడా సీఎం జగన్ అమలు చేశారన్నారు. మళ్లీ ఈ పథకాలన్నీ వలంటీర్ల ద్వారా అందాలంటే ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ జేసీఎస్ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, పార్టీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఓదూరి శ్రీనివాసరావు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, ఏఎంసీ డైరెక్టర్ కల్యాణం గంగాధరరావు, నాయకులు బోనం బులివెంకన్న, గుబ్బల వేణు తదితరులు పాల్గొన్నారు.

హోలీ.. ఆనందాల కేళీ





పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నా, పెద్దా రంగులు చల్లుకుంటూ ఆనందంగా ఉత్సవాలు జరుపుకున్నారు. సోమవారం భీమవరంలో, భీమవరం మండలం చినఅమిరంలో హోలీ వేడుకల దృశ్యాలివి.

– భీమవరం/భీమవరం అర్బన్

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పెదపాడు: అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుని ఒక మహిళ మృతి చెందిన ఘటన పెదపాడు మండలంలోని వసంతవాడలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం వసంతవాడకు చెందిన పోలగాని నాగరాజు భార్య ఉషారాణి(27)తో రోజు తాగొచ్చి గొడవపడేవాడు. ఈ నెల 24న కూడా భార్యను కొట్టి గాయపర్చాడు. మనస్తాపం చెందిన ఆమె పక్కనే ఉన్న పులవర్తి ఫణీంద్ర ఇంటి ఆవరణలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులకు సమాచారం అందడంతో పంచనామా చేసి పోస్టుమార్టంకు మృతదేహాన్ని తరలించారు.



బుట్టాయగూడెం: జీలుగుమిల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యతేజ



ఉంగుటూరు: మండలంలోని సరిపల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

అడుగడుగునా నిఘా



కామవరపుకోట: కొత్తూరులో తనిఖీలు నిర్వహిస్తున్న జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తనిఖీలు ముమ్మరం చేశారు. చెక్‌పోస్టుల వద్ద వాహనాలు ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. పోలవరం నియోజకవర్గ పరిధిలోని అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా పటిష్టం చేశారు. తెలంగాణ సరిహద్దు నుంచి అక్రమంగా మద్యం, నగదు రవాణాకు అడ్డుకట్ట వేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. అక్రమ నగదు ప్రవాహానికి చెక్ పెట్టేలా జిల్లాలోని ప్రతి మండలంలో పోలీసు అధికారులు వాహనాల్ని ఆపి తనిఖీ చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దెందులూరు: మండలంలోని సోమవరప్పాడు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

కైకలూరు జనసేనకే కేటాయించాలి

- ఎన్నికల ముందు వచ్చేవాళ్లకు సీటు కేటాయిస్తే ఊరుకోం
- కామినేని తీరుపై జనసైనికుల కన్నెర్ర

కైకలూరు: ఏలూరు జిల్లా కైకలూరు సీటుపై కూటమిలో పోరు తారా స్థాయికి చేరింది. బీజేపీ సీటు ప్రకటించకముందే టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుల అభ్యర్థిని అంటూ గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్‌కు జనసేన నుంచి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం ప్రకటించిన 21 సీట్లలో కైకలూరు నియోజకవర్గం లేదు. దీంతో ఈ సీటు ఆశిస్తున్న బీవీ రావుతో కలసి జనసేన నేతలు కైకలూరు జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ జనసేన నేతలు పోకల దేవేంద్ర గోపాలకృష్ణ, కోట విప్లవ వరప్రసాద్, నాగనబోయిన విజయ్‌కుమార్, మోరు విజయరాజు, నాగదేశి గణేష్ బాబు, నర్రా ప్రభు, శివరామకృష్ణ యాదవ్‌లు కైకలూరు సీటును జనసేనకే కేటాయించేలా పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాదులో ఉంటూ ఎన్నికల ముందు పదవుల కోసం వచ్చేవాళ్లకు సీటు కేటాయిస్తే ఎలా అంటూ పరోక్షంగా కామినేని శ్రీనివాస్‌నుద్దేశించి విమర్శించారు. బీసీ కులానికి చెందిన విద్యావంతుడైన యువకుడు బీవీ రావు 2019లో జనసేన తరఫున పోటీ చేసి ఓటమి చెందారని, అప్పటి నుంచి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేసి సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తిని కాదని సీటును బీజేపీకి కేటాయిస్తే వ్యతిరేకిస్తామని హెచ్చరించారు.



కైకలూరు జనసేన ఇన్‌చార్జి బీవీ రావుతో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

జనసేనలో రెండు వర్గాలు

నియోజకవర్గంలో జనసేన నేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. బీవీ రావు కార్యాలయం, గాంధీబొమ్మ సెంటర్ వద్ద తోట లక్ష్మికి చెందిన మరో కార్యాలయం ఉంది. బీవీ రావు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. పొత్తుల్లో భాగంగా తోట లక్ష్మి, కొల్లి బాబి, నల్లగోపల చలపతిరావు కామినేనికి మద్దతుగా ఉన్నారు. ఇప్పటికే ఆయనతో పాటు ప్రచారంలో పాల్గొంటున్నారు. జనసేన తరఫున సీటు ఆశిస్తున్న బీవీ రావు మాత్రం గ్రామాల్లో జనసేన జయభేరి పేరుతో పర్యటిస్తున్నారు.

నిట్ విద్యార్థులకు బహుమతులు



బహుమతి అందుకున్న విద్యార్థిని అభినందిస్తున్న చిత్రం

తాడేపల్లిగూడెం: జాతీయస్థాయి పోటీల్లో ఏపీ నిట్ విద్యార్థులు బహుమతులు సాధించారు. పూనెలో జరిగిన జాతీయస్థాయి కాన్ఫరెన్స్‌లో నిట్‌కు చెందిన నలుగురు విద్యార్థులు వేర్వేరు కేటగిరీలలో రెండు బహుమతులను అందుకున్నారు. మెటలర్జికల్ మెటీరియల్స్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి రాఘవరపు పార్థసారథికి ఉత్తమ పేపర్ ప్రజంటేషన్ అవార్డు దక్కింది. పౌడర్ మెటలర్జికల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏటా జాతీయస్థాయిలో సదస్సు నిర్వహించి పరిశోధక ఆచార్యులను, విద్యార్థుల ప్రతిభ గుర్తించి ప్రోత్సహిస్తుంది. మెకానికల్ అల్లోయింగ్ ఆఫ్ హై ఎంట్రోపీ అల్లాయిస్‌పై పేపర్ ప్రజంటేషన్ ఇచ్చారు,. ఈ ప్రజంటేషన్‌కు నిర్వాహకులు అవార్డుతో పాటు రూ.5 వేల నగదును ఇచ్చారు. ఈఈఈ నాలుగో సంవత్సరం విద్యార్థి వి.జయంత్, పి.భాను , కె.దీక్షితలు శశి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాజెక్టు ఎక్స్‌పో కార్యక్రమంలో మైక్రో కంట్రోలర్‌ను ఉపయోగించి ఎలక్ట్రికల్ వాహనాల్లో తక్కువ ధర బ్యాటరీ, నిర్వహణ వ్యవస్థ, ఆరోగ్యస్థితిని అంచనా వేయడం అనే ప్రాజెక్టును ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టు అవార్డుతో పాటు నగదు బహుమతిని అందుకుంది.

నేడు మిజోరాం గవర్నర్ రాక

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా మిజోరాం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు హాజరుకానున్నారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ చెప్పారు. 26న ఉదయం 10 గంటలకు నిర్వహించే వార్షికోత్సవానికి హరిబాబు హాజరై విద్యార్థులకు పతకాలు అందిస్తారన్నారు.

వైభవంగా డోలా పౌర్ణమి వేడుకలు



తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో సోమవారం డోలా పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. అందులో భాగంగా ఉదయం, రాత్రి వేళల్లో ఉభయదేవేరులతో శ్రీవారు తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ముందుగా ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వెండి తొళక్క వాహనంపై ఉంచి విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపి హారతులిచ్చారు. ఆ తర్వాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా తిరువీధులకు పయనమైంది.

ఏలూరులో కొత్త సినిమా షూటింగ్



ఆర్‌వీ స్టూడియోస్ ప్రొడక్షన్ నెంబర్ 1 చిత్ర షూటింగ్‌కు క్లాప్ కొడుతున్న డీఆర్‌డీఏ పీడీ విజయరాజు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్‌వీ స్టూడియోస్ బ్యానర్‌పై నూతన నటీనటులతో నిర్మించనున్న ప్రొడక్షన్ నెంబర్ వన్ చిత్రం ముహూర్తపు షాట్‌ను ఏలూరులోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం తీశారు. పూజా కార్యక్రమాల అనంతరం నలుగురు స్నేహితుల మధ్య సంఘటనా దృశ్యాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ ఆర్. విజయరాజు మాట్లాడుతూ మంచి సందేశాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్న ఆర్‌వీ స్టూడియోస్ అధినేత రవికుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. సినీ నిర్మాత, దర్శకుడు, రచయిత దాసరి రవికుమార్ మాట్లాడుతూ నూతన నటీనటులతో ఈ సినిమా తీస్తున్నట్లు చెప్పారు. రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి రాయుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మునిగి వ్యక్తి ఆత్మహత్య

ఉంగుటూరు: ఫత్తేపురం గ్రామానికి చెందిన రావూరి సాయికుమార్(30) నాచుగుంట కోటాడ చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయికుమార్ సీతారామపురంలో వడ్రంగి పనిచేసి చేస్తుంటాడు. భార్యభర్తల మధ్య గొడవ నేపథ్యంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు చెబుతున్నారు. సునీల్‌కుమార్ మృతదేహం కోటాడ చెరువులో తేలియాడడం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మణికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భార్యాభర్తల మధ్య గొడవ నేపథ్యంలోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక

భీమవరం: జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు అత్యున్నత ప్రదర్శనతో రాణిస్తున్నారని బాడీబిల్డింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరాజు అన్నారు. ఏప్రిల్ 6, 7 తేదీల్లో గోవాలో నిర్వహించే జాతీయస్థాయి ఫెడరేషన్ కప్ బాడీ బిల్డింగ్ పోటీలకు రాష్ట్ర టీం సెలక్షన్స్ భీమవరం పట్టణంలోని కే12 జిమ్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రంలోని బాడీబిల్డర్లు మరిన్ని పతకాలు సాధించే దిశగా ఆంధ్ర బాడీబిల్డర్స్ అసోసియేషన్ కృషిచేస్తుందన్నారు. అనంతరం జాతీయస్థాయి మిస్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన బాలకృష్ణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసిం, అధ్యక్షుడు స్వామి రమేష్‌కుమార్, జిల్లా జాయింట్ సెక్రెటరీ వలవల ఫణి, గోవర్ధన్, మోటేపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో జాతీయస్థాయి ఫెడరేషన్ కప్ బాడీ బిల్డింగ్ పోటీల రాష్ట్ర జట్టు

శివ, కేశవ స్వాముల విగ్రహాల ప్రతిష్ఠ

కాళ్ల: శివనామ స్మరణతో కాళ్ల మండలం దొడ్డనపూడి గ్రామం మార్మోగింది. శ్రీ పార్వతి సమేత చంద్రమౌళీశ్వర స్వామి, భూసమేత చెన్నకేశవస్వామి, పరివార దేవతా విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవం సోమవారం కనులపండువగా నిర్వహించారు. గ్రామమంతా భక్తిపారవశ్యంతో నిండిపోయింది. వేదమంత్రాల భక్తులు, దాతలు, గ్రామ ప్రజల సహాయ సహకారాలతో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో విగ్రహాల ప్రారంభోత్సవం కార్యక్రమం నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. పలువురు రాజకీయ ప్రముఖులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామమంతా సుభిక్షంగా సుఖ సంతోషాలతో ఎల్లప్పుడూ ఆధ్యాత్మిక చింతనతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు.



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కొల్లేరులో అక్రమ చెరువు గట్ల ధ్వంసం

భీమడోలు: ఆగడాలలంక రెవెన్యూ పరిధిలో అక్రమంగా నిర్మించిన కొల్లేరు కాంటూరు చెరువు గట్లను సోమవారం అటవీ శాఖ అధికారుల సమక్షంలో నిర్వాహకులే స్వచ్ఛందంగా ధ్వంసం చేశారు. పొక్లెయిన్ సాయంతో గట్లను తొలగించి చదును చేశారు. కొల్లేరు కాంటూరు పరిధి ఆగడాలలంక రెవెన్యూ పరిధిలోని లక్ష్మీపురం చెక్ పోస్టు పక్కనే ఉన్న టైటానిక్ చెరువును 2006 కొల్లేరు ఆపరేషన్‌లో ధ్వంసం చేశారు. 2018లో ఎస్సీ సొసైటీ పెద్దలు 50 ఏకరాల విస్తీర్ణంలోని ఆ చెరువును పునరుద్ధరించుకుని అక్రమంగా చేపల సాగు చేస్తున్నారు. ఇటీవల గట్లు దెబ్బతినడంతో మరమ్మత్తులు చేపట్టే పనులకు ఉపక్రమించారు. అటవీశాఖ అధికారులు అడ్డుకున్న పెద్ద సంఖ్యలో గ్రామస్తులు రాత్రి వేళల్లో పొక్లెయిన్ సాయంతో పనులు కొనసాగిస్తున్నారు. అటవీశాఖ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో పోలీసులకు వివరాలను అందించారు. అటవీశాఖ సెక్షన్ అధికారిణి పాపారత్నం, బీట్ అధికారి శ్రీనివాసరావు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారి ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేశారు. ఏడు రోజుల్లో ఆ చెరువు గట్లను స్వచ్ఛందంగా తొలగించకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో గట్లను ధ్వంసం చేశారు. కొల్లేరు కాంటూరు పరిధిలో అక్రమంగా చెరువులు తవ్వినా, మరమ్మతులు చేపట్టినా కేసు నమోదు చేస్తామని రేంజర్ టి.సాయి తెలిపారు.



పొక్లెయిన్ సాయంతో చెరువు గట్టు తొలగిస్తున్న దృశ్యం

నోబెల్ వరల్డ్ రికార్డుకు ఎంపిక



నోబెల్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన క్రీడాకారులతో కరాటే మాస్టర్లు

తణుకు అర్బన్: తణుకులో కేఎస్ మార్షల్ ఆకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన మార్షల్ ఆర్ట్ ప్రదర్శనలో కరాటే క్రీడాకారులు సత్తా చాటారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో భాగంగా నోబెల్ వరల్డ్ రికార్డ్స్ కోసం ఆ సంస్థ ఏర్పాటుచేసిన మార్షల్ ఆర్ట్స్‌లో 234 మంది క్రీడాకారులు పాల్గొని తమకు నిర్దేశించిన 1872 వాటర్ బెలూన్స్‌ను బ్లాస్ట్ చేశారు. క్రీడాకారుల ప్రదర్శన అద్భుతమని నోబెల్ వరల్డ్ రికార్డు ఎడిటోరియల్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ హేమలత అన్నారు. నోబెల్ వరల్డ్ రికార్డులో క్రీడాకారులు స్థానం సంపాదించారని స్పష్టం చేస్తూ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌ను అభినందించారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): గుండెపోటుతో ఉపాధి హామీ పథకం కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని మెట్ట ఉప్పరగూడెంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన మర్లపూడి సులోమాన్ రోజు సోమవారం ఉపాధి హామీ పథకం పనులకు వచ్చాడు. పనిచేస్తుండగా గుండె పోటు రావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మధ్యలో మృతి చెందాడు. గతంలో సులోమాన్ భార్య నాగలక్ష్మి రోడ్డు ప్రమాదంలో, కుమారుడు రాజేష్ కోవిడ్‌తో మృత్యువాత పడ్డారు. ప్రస్తుతం కోడలు, వారి పిల్లల ఆలనా పాలనా చూస్తూ పెద్ద దిక్కుగా సులోమాన్ నిలిచాడు. ఆయన మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది.

క్లుప్తంగా

దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేయించాలి



భవిత దివ్యాంగుల కేంద్రంలో మాట్లాడుతున్న ఎస్‌కే బాలీశ్వరయ్య

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల కేంద్రంలో సోమవారం దివ్యాంగుల పిల్లలకు, వారి తల్లిదండ్రులకు నేషనల్ సెబ్రల్ పాలసి అవేర్నెస్ డే సందర్భంగా గర్భంలో మెదడుకు వచ్చే సమస్యలపై డైమండ్స్ అధ్యక్షుడు పేరిచర్ల మురళీకృష్ణంరాజు సౌజన్యంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య మాట్లాడుతూ గర్భంలో శిశువు మెదడుకు పక్షవాతం రావడం వల్ల పిల్లలలో కండరాలు బిగుసుకు పోవడం, కాళ్లు, చేతులు వంకర్ల పోవడం, సరిగా నడవలేకపోవడం, మాటలు స్పష్టంగా రాకపోవ డం తదితర లక్షణాలను వెల్లడించారు. అవసరమైతే చిన్నపాటి అపరేషన్లు చేసి ఫిజియోథెరపీ చేయాలని, బిగుచుకుపోయిన కండరాలు లూజ్ అవుతాయని ఇతరులపై ఆధారపడకుండా జీవించగల్గుతారని తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు మిఠాయిలు పంచారు. హెచ్‌ఎం జ్యోతి, ప్రత్యేక ఉపాధ్యాయుని ఎం.చంద్రకుమారి, కె.సత్యనారాయణరాజు, జామి సత్యనారాయణ, యర్రా ఆంజనేయస్వామి తదితరులు హాజరైయారు.

ఘనంగా పౌర్ణమి పూజలు



పెంట్లమ్మ అమ్మవారి ఆలయంలో అన్నసమారాధన దృశ్యం

పెంటపాడు: పెంటపాడు మండలంలో పలు ఆలయాల్లో సోమవారం పౌర్ణమి సందర్భంగా అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నసమారాధనలు నిర్వహించారు. ప్రత్తిపాడు వై.జంక్షన్‌లో కనకదుర్గమ్మ అమ్మవారికి పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సైపురెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. కె. పెంటపాడు గ్రామ దేవత పెంట్లమ్మ అమ్మవారి ఆలయంలో పౌర్ణమి పురస్కరించుకొని భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పంతం శేఖర్, భక్తులు పాల్గొన్నారు. యానాలపల్లి, రావిపాడు, మీనవిల్లూరు గ్రామాల్లో అయ్యప్పస్వామి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భజనలు చేశారు.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించండి



సమావేశంలో మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని, సహకరించే పార్టీలను ఓడించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక అపరాల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక చుక్కా అప్పలస్వామి భవనంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. వక్తలు మాట్లాడుతూ సంపదకు మూలమైన కార్మిక రాజ్యం కోసం సీఐటీయూ సమరశీల పోరాటాలు చేస్తుందని చెప్పారు. మోదీ చెబుతున్న వికసిత్ భారత్ ఎక్కడ అని ప్రశ్నించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చుతుందని విమర్శించారు. మతం పేరుతో విభజనలను అడ్డుకోవాలని, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కోరారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలను ప్రజలు ఎండగట్టాలని, బీజేపీకి రానున్న ఎన్నికలలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, అయినాల సత్యనారాయణ, నర్మాల నారాయణరావు, ఇల్ల గోవిందరావు, దాసరి రాజు, నీరుకొండ రమణ, రావి శ్రీను, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉమా వైద్యనాథేశ్వరస్వామికి పుష్పోత్సవం

యలమంచిలి: పెనుమర్రులోని శ్రీ ఉమా వైద్యనాథేశ్వరస్వామికి జరుగుతున్న కల్యాణోత్సవాలలో భాగంగా సోమవారం దేవేరులకు త్రిశూల స్నానం, వసంతోత్సవం, పుష్పోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు బాదంపూడి వరప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం గ్రామ బలిహరణ కార్యక్రమంలో భాగంగా శ్రీ ఉమా సహిత వైద్యనాథేశ్వరస్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి నిర్వహించే అఖండ అన్నసమారాధనతో ముగుస్తాయని అలయ నిర్మాత పొత్తూరి సోమరాజు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్‌కుమార్ చెప్పారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- నేను చేసిన సేవలను గుర్తించండి
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



జగన్నాథపురంలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ఆరుగొలను గ్రామ ప్రజలకు తాను ఏమి చేసింది తెలుసునని వచ్చే ఎన్నికల్లో తనకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కోరారు. తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను, జగన్నాథపురం, కృష్ణాయపాలెం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులతో సోమవారం ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ తాను క్వారీ లారీల వ్యాపారానికి సంబంధించి వచ్చిన పోలీసు కేసులను కొట్టివేయించి ఆరుగొలను గ్రామ లారీ ఓనర్లకు సాయం చేశానన్నారు. ప్రస్తుతం తనకు ప్రత్యర్థిగా పోటీ చేస్తున్న వ్యక్తి గతంలో తన సహకారంతోనే తాడేపల్లిగూడెం మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలిచారన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్‌గా ఎదగడానికి తన సహకారం తీసుకున్నాడని గుర్తు చేశారు. తనను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలకు మరింత సంక్షేమం, అభివృద్ధి అందజేస్తానని మంత్రి కొట్టు తెలిపారు. రాష్ట్రం కుల, మత, పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించడం వల్లే గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లి దమ్ముగా ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఉందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో అధికారంలోకి తీసుకురావడానికి సమన్వయంతో పనిచేయాలన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా పాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధి వివరించాలని పిలుపునిచ్చారు. మరలా జగన్ సీఎం అయితే మరిన్ని పథకాలు అమలుచేసే కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో ప్రజల సొమ్ములను టీడీపీ నాయకులు దోచుకున్నారని విమర్శించారు. సీఎం జగన్ చరిష్మాను తట్టుకోలేక కూటమిగా ఎన్నికలకు వస్తున్నారని, ఎంతమంది కలిసి వచ్చినా సీఎం జగన్‌కు పట్టం కట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. రెండు ఓట్లూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటికి జగన్నాథపురంలో ప్రతి ఇంటికి తిరిగానన్నారు. 30 ఏళ్లుగా తనకు ఓటు వెయ్యని కుటుంబాలకు కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ధిని అందజేశామన్నారు. వర్షాకాలంలో పంటలు దెబ్బతింటే పంటనష్టం ఇప్పించాలని తన వద్దకు వచ్చిన రైతులకు ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారాన్ని సుమారు రూ. 2కోట్లు అందజేశామన్నారు. లిఫ్టు ఇరిగేషన్ ద్వారా సుమారు 700 ఎకరాలు సాగులోకి తీసుకువచ్చామన్నారు. రైతు నష్టపోతే ఆదుకున్న సందర్భాలు తెదేపా ప్రభుత్వంలో లేదన్నారు. 45 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్న చంద్రబాబు ఏనాడైనా రైతులకు పంట నష్టం, సబ్సిడీ వంటి పథకాలు అమలు చేశాడా అని ప్రశ్నించారు. మహానాయకుడు ఎన్‌టీ రామారావుకు వెన్ను పోటు పొడిచిన తర్వాత ఏనాడు సింగిల్‌గా పోటీ చేసే ధైర్యం చంద్రబాబుకు లేదన్నారు. ఇప్పుడు కూడా బీజేపీ, జనసేనలతో కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాడని ప్రజలు ఓటు వేసే పరిస్థితి లేకపోవడంతో జనసేన నాయకుడు పవన్‌తో కలిసి సమావేశాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. సంక్షేమం అభివృద్ధి కోరుకునే ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని, తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, ఎంపీపీ పానుకుమాటి శేషులత, ఏఎంసీ చైర్మన్, ముప్పిడి సంపత్‌కుమార్, కైగాల శ్రీనివాస్, బాపన్న, పోలుమోను శ్రీనివాస్, మార్లపూడి సుబ్బారావు, సంతపరావు, లక్ష్మణరావు, నాగులు, పెద్దబుజ్జి, పెద సత్యనారాయణ, చిక్కాల సత్యనారాయణ, నార్ని శంకరరావు, అడపా అప్పలరాజు పాల్గొన్నారు.

ఘనంగా చింతామణిదేవికి పూజలు



కృష్ణ పరమాత్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఫాల్గుణ పౌర్ణమి పురస్కరించుకుని సోమవారం ఉదయం నిత్యార్చనలు, శ్రీ లక్ష్మీ జయంతి సందర్భంగా స్థానిక కృష్ణ మందిరంలో ఆలయ అర్చకులచే చింతామణిదేవి అమ్మవారికి లక్ష్మీ సహస్ర అష్టోత్తర శత నామ కుంకుమ పూజలు జరిగాయి. శ్రీ కృష్ణ మందిరంలో మహిళా భక్తులచే ప్రమిద దీపాలతో పూజలు, అనంతరం కాలువకు వెళ్లి పౌర్ణమి గంగా హారతి ఇచ్చారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

వాసవి మాతకు ప్రత్యేక పూజలు

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో వాసవి మాతకు పౌర్ణమి సందర్భంగా సోమవారం అమ్మవారికి విఘ్నేశ్వర పూజ, మూల విరాట్‌కు పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలు, ఫలరసాలతో విశేషముగా అభిషేకాలు జరిగాయి. అమ్మవారికి రజిత చీరను అలంకరించారు. ఉమా చంద్రశేఖర్‌స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆర్యవైశ్య భక్తులు పాల్గొన్నారు.

విజయచాముండేశ్వరి అమ్మవారికి విశేష పూజలు



విశేష అలంకరణలో విజయచాముండేశ్వరి అమ్మవారు

అత్తిలి: మదన పౌర్ణమి, లక్ష్మీదేవి జయంతి సందర్భంగా అత్తిలిలో స్వయంభుగా వెలసిన విజయ చాముండేశ్వరిదేవి ఆలయంలో పంచామృతాలతో అమ్మవారికి అభిషేకాలు జరిపారు. ఆలయ ధర్మకర్త కందుల సత్యనారాయణ, భాగ్యలక్ష్మి దంపతులచే పూజాదికాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు వెలవలపల్లి సత్యశ్రీరామప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో లక్ష్మీహోమం చేశారు.ఈ కార్యక్రమంలో కందుల శ్రీనివాస్‌కల్పనా దంపతులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి అన్నాభిషేకం...

అత్తిలి బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామికి 108 కిలోల అన్నంతో అన్నాభిషేకం చేశారు. అయ్యప్పస్వామి జన్మనక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు, వల్లీ వెంకటేష్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మీదేవి జన్మదినోత్సవం సందర్భంగా అష్టలక్ష్మీ మూలమంత్రహోమం, మహాశాంతిహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో హోలీ వేడుకలు



తణుకు: సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థులు



తాడేపల్లిగూడెం(టీఓసీ): పాతూరులో హోలీ పండుగ చేసుకుంటున్న విద్యార్థులు

తణుకు టౌన్: పట్టణం, పరిసర ప్రాంతాల్లో సోమ వారం హోలీ పండుగను వివిధ వర్గాల ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. వివిధ విద్యాసంస్థల విద్యార్థులు రంగులు చల్లుకుంటూ కేరింతలతో ఉత్సాహంగా గడిపారు. యువత ఒకరిపై మరొకరు రంగులు జల్లుకున్నారు. ఈ సందర్భంగా తణుకు వెంకట్రాయపురం మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెదపాటి గోపాల కృష్ణ మాట్లాడుతూ చెడుపై మంచి విజయం సాధించిన సందర్భంగా హోలీ వేడుకలు జరుపుకుంటారని చెప్పారు. వసంత కాలం ఆగమనం ప్రజల మధ్య ఐక్యత, సోదర బావం పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ అమ్మాజీ, పేరెంట్ కమిటీ సభ్యులు దుర్గా దేవి, ప్రశాంతి, లావణ్య, పద్మ, విజయలక్ష్మి, ఉమామహేశ్వరి, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా హోలీ పండుగ

తాడేపల్లిగూడెం (టీఓసీ): హోలీ పండుగ రంగుల పండుగ కావడంతో పాటు హిందువులు వసంత కాలంలో జరపడంతో భారతదేశంలో అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. ఈ పండుగ సందర్భంగా భగవంతుడైన కృష్ణుడును సైతం పూజించడం అనవాయితీగా వస్తుంది. తాడేపల్లిగూడెం పట్టణంలో సోమవారం హోలీ పండుగను కోలాహలంగా నిర్వహించారు. హోలీ సందర్భంగా పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో విద్యార్థులు, యువకులు, మహిళలు రోడ్లుపైకి వచ్చి ఒకరిపై ఒకరు రంగులు కలిపిన నీళ్లను చల్లకుంటూ, రంగులను ముఖంపై రాస్తూ ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో ఈ కోలాహలం, సందడి చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి

కాళ్ల: మండల పరిధిలో పోలింగ్ బూత్‌లను జేసీ, ఉండి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీవీ ప్రవీణ్ ఆదిత్య సోమవారం తనిఖీ చేశారు. పెదమిరంలో-5, కోపల్లెలో-4, వేంపాడులో-2తో కలిపి మొత్తం 11 పోలింగ్ బూత్‌లను జేసీ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, తదితర సౌకర్యాల కల్పనపై సెక్టోరల్, నోడల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మండల పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో శాంతియుతంగా ఎక్కువ శాతం పోలింగ్ జరిగేలా 'స్వీప్' ద్వారా అవగాహనా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సెక్టారోల్ అధికారి పంచాయతీరాజ్ ఏఈ రమేష్, సర్వేయర్లు, వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ప్రజాబలమే వైఎస్సార్ సీపీకి వెన్నుదన్ను

తణుకు 5, 6 వార్డుల పార్టీ శ్రేణుల సమావేశంలో మంత్రి కారుమూరి



తణుకులో పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఎన్నికల్లో ప్రజాబలమే వైఎస్సార్ సీపీకి వెన్నుదన్నుగా నిలుస్తుందని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. తణుకు 5, 6 వార్డులకు సంబంధించి షాదిఖానాలో సోమవారం నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోను లేని విధంగా కోట్లాది రూపాయిలు సంక్షేమాన్ని ప్రజలకు అందించిన వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఓటడిగే హక్కు ఉందన్నారు. కుల, మత పార్టీ బేధాల్లేకుండా అన్ని వర్గాలు, అన్ని పార్టీల వారికి పారదర్శకంగా సంక్షేమాన్ని అందజేసిన ఒకే ఒక్క జననేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజలకు చేసిన మంచితో కాలర్ ఎగరేసి ఓటడిగే హక్కు మనకు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. గతంలో చంద్రబాబు హామీలు గుప్పించి ఎగ్గొట్టినవైనంచూసి ప్రజల్లోకి ఎలా వస్తారని, ఏం చేస్తామని చెప్పి ప్రజలను ఓట్లడుగుతారని ప్రశ్నించారు. తణుకు నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధికి రూ. 3500 కోట్లు ఖర్చుచేశామని గుర్తుచేశారు.

ఈనెల 27 నుంచి సీఎం జగన్ బస్సుయాత్ర

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 27 నుంచి సుడిగాలిలా నిర్వహించే బస్సుయాత్ర ద్వారా ప్రజల్లోకి రానున్నారని మంత్రి కారుమూరి అన్నారు. బస్సుయాత్ర ద్వారా పూర్తిగా ప్రజల్లోనే ఉంటూ ఎక్కడ ఆగితే అక్కడే టెంట్‌లో నిద్రించి కొనసాగించే బస్సుయాత్ర ద్వారా వచ్చే సునామీలో టీడీపీ కూటమి కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలనే జగన్ పరిపాలనకు ప్రజలు పట్టంకట్టనున్నారని మూడు కండువాలతో వచ్చే నాయకులకు ఈ విషయం అర్థమైపోయిందని అన్నారు. ప్రజలంతా ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అనంతరం స్థానిక వార్డుల్లో మంత్రి కారుమూరి పార్టీ శ్రేణులతో కలిసి గడప గడపకు వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మెహర్ అన్సారీ, నూకల కనకదుర్గ, ఝాన్సీ లారెన్స్, 5,6 వార్డుల నాయకులు సుద్దుల పాండు, దాసి రత్నరాజు, షేక్ సలీం, ఉండ్రాజవరపు గీత, కారుమంచి మిత్ర పాల్గొన్నారు.

31న టీబీఆర్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు

పెంటపాడు: పరీక్షలు పూర్తిచేసుకొన్న పలువురు విద్యార్థులకు ఉన్నత విద్యకోసం ఈనెల 31న టీబీఆర్ సైనికస్కూల్లో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర మాజీ సైనికసంఘ నాయకులు టి. భోగేశ్వరరావు ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, డిఫెన్స్‌లో ఎన్‌డీఏ, ఎస్ఎస్‌బీ, సీడీఎస్, ఆఫ్‌కేట్, లాంగ్ టర్మ్‌లో ఐఐటీ, జేఈఈ, నీట్, ఎన్‌డీఏ కోర్సులలో చేరే విద్యార్థులకు అవగాహన సదస్సు ఉంటుందన్నారు. ఈ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొవాలన్నారు.

చెస్ ఉచిత శిక్షణ శిబిరం

భీమవరం: చదరంగంలో శిక్షణ ద్వారా మేధాశక్తిని పెంపొందించుకుని విద్యలో ఉన్నతంగా రాణించవచ్చునని చెస్ ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్ పీడీఎస్ గిరినాథ్ అన్నారు. అనసూయ చెస్ అకాడమీ, జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం విశ్వకవి స్కూల్లో ఉచిత చదరంగం శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు పిల్లల ఆసక్తి మేరకు తల్లిదండ్రులు వివిధ రంగాల్లో శిక్షణ ఇప్పించడం ద్వారా ఉన్నత స్థాయిలో రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చదరంగం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్, ఉపాధ్యక్షుడు తోట హరిబాబు, సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గోటేరు సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఇరగవరం: మండలంలోని గోటేరు గ్రామంలో సోమవారం ఇరగవరం మండల నాయకులు బూత్ లెవెల్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, మాట్లాడుతూ రానున్న ఎన్నికలు వైఎస్సార్ సీపీ గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేగా కారుమూరి వెంకట నాగేశ్వరరావును, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించుకుని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలన్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు మండల, నియోజకవర్గ నాయకులు దృష్టికి తీసుకు రావాలన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో బూత్ లెవెల్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జుత్తిగ గాయిత్రి కిషోర్, ఎంపీటీసీ రాజేశ్వరి సుబ్రమణ్యం, గ్రామా పార్టీ అధ్యక్షుడు అన్నాబత్తుల వీరాస్వామి, బాబ్జీ, నాయకులు సత్తి వెంకట రెడ్డి, చోడే జోషి, మామిడిశెట్టి శ్రీను, జేసీఎస్ కన్వీనర్ దినేష్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంతరిస్తున్న కళలను ఆదరించాలి

పాలకొల్లు అర్బన్: అంతరించిపోతున్న కళారంగాన్ని బతికించుకోవడానికి దాతలు ముందుకు రావాలని శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ కావలి శ్రీనివాసరావు అన్నారు. పాలకొల్లు యడ్లబజారులో వేంచేసియున్న శ్రీకనక దుర్గమ్మ కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి షిరిడి సాయి నాట్యమండలి, నరసాపురం వారి ఆధ్వర్యంలో «చిల్లరకొట్టు చిట్టెమ్మ» సాంఘిక నాటకం ప్రదర్శించారు. ఈ నాటకంలోని పాత్రధారులు మానాపురం సత్యనారాయణ, శాంతారావును ట్రస్టుబోర్డు చైర్మన్ శ్రీనివాసరావు శాలువాతో సత్కరించి అభినందించారు. శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ జోగి వెంకటేశ్వరరావు, ట్రస్టీ తాతపూడి శ్రీరాములు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉనికెల శ్రీనివాస్, జోగాడ ఉమామహేశ్వరరావు, కొండేటి రవి, గుండుబోయిన నాగేశ్వరరావు, భాగవతం తిరుమల ఆచార్యులు, ఆలయ సిబ్బంది రాంబాబు, మంగతాయారు తదితరులు కళాకారులను అభినందించారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్



అత్తిలిలో విద్యుత్ వెలుగుల్లో నూతనంగా ఏర్పాటుచేసిన మసీదు



తణుకు మసీదులో నమాజు చేస్తున్న ముస్లింలు

- వచ్చే నెల 11న రంజాన్ పర్వదినం
- తణుకు నియోజకవర్గంలో మసీదుల్లో నిత్య నమాజులు

తణుకు అర్బన్: అభిమానానికి, స్నేహానికి ప్రతీకగా భావించే రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలంతా దినచర్యగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. పవిత్ర ఖురాన్ అవతరించిన మాసం సందర్భంగా మార్చినెలను ముస్లింలంతా రంజాన్ మాసంగా పరిగణించి కఠిక ఉపవాసాలు ఆచరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసంలో తోటివారికి సాయపడుతూ దానధర్మాలు చేస్తూ త్యాగనిరతిని కొనసాగిస్తూ క్రమశిక్షణ, ధార్మిక చింతనతో మెలుగుతారు. ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభమైన రంజాన్ మాసం పురస్కరించుకుని తణుకు నియోజకవర్గంలోని మసీదుల్లోను, గృహాల్లోను ముస్లింలంతా ప్రత్యేకంగా నమాజులు చేస్తూ అల్లాను కొలుస్తున్నారు.

నిష్ఠగా ఉపవాసాలు...

వచ్చేనెల 11వ తేదీన రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు నిష్ఠతో కఠిక ఉపవాసాలు నిర్వహిస్తున్నారు. తెల్లవారు జామునే తేలికపాటి ఆహారం తీసుకుని తిరిగి రాత్రి వరకు సుమారు 13 గంటలపాటు ఉపవాసంగా నిలబడి మళ్లీ రాత్రి స్వల్ప ఆహారం తీసుకుంటారు. ఈ రంజాన్ మాసంలో ఎంతో కఠినంగా ఉపవాసాలు చేసి దాతృత్వంతో ఉంటే ఏళ్ల తరబడి ప్రార్థనలు చేస్తే వచ్చే పుణ్యం ఈ మాసంలో దక్కుతుందనేది వారి విశ్వాసం. అంతేకాకుండా ఈ మాసంలో ముస్లింలు తమ సంపాదనలో కొంత మొత్తాన్ని పేదలకు అందిస్తూ పేద, ధనిక అంతరాలకు తావులేకుండా చేస్తారని మసీదు గురువులు చెబుతున్నారు.

దివ్య ఖురాన్ అవతరించిన మాసం



దివ్య ఖురాన్ అవతరించి రంజాన్ మాసాన్ని ముస్లింలంతా ఎంతో భక్తిగా జరుపుతారు. ఈ మాసమంతా ఎంతో నియయనిష్టలతో ఉపావాస దీక్షలు చేస్తూ ఖురాన్ పఠనంతోపాటు, జకాత్ రూపంలో పేదలకు దానధర్మాలు చేస్తాం.

– మెహర్ అన్సారీ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, తణుకు

స్నేహానికి, దయాగుణానికి ప్రతీక రంజాన్



ముస్లింలకు పెద్ద పండుగలాంటి రంజాన్ పండుగ స్నేహానికి, దయాగుణానికి ప్రతీకగా నిలుస్తోంది. 30 రోజులపాటు కఠినంగా ఉపవాసాలు చేయడమే కాకుండా పేదలకు సాయపడే విధంగా ముస్లింలను ఖురాన్ నడిపిస్తోంది.

– షేక్ సలీం, వైఎస్సార్ సీపీ తణుకు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు

దానగుణానికి ప్రతీకగా రంజాన్ మాసం



ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసంలో నియమ నిష్ఠలతో ప్రార్థనలు చేస్తాం. అంతేకాకుండా తమ సంపాదనలో వారి స్తోమతను బట్టి కొంత ధనాన్ని పేదలకు సాయంగా అందిస్తుంటారు. దానగుణానికి ప్రతీకగా ముస్లింలు రంజాన్ మాసాన్ని ఆచరిస్తుంటారు.

– షేక్ బాజీ, వైఎస్సార్ సీపీ తణుకు పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షుడు